క్లుప్తంగా

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనం ఎత్తుకున్న జెడ్పీటీసీ లావణ్య

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఆదివారం ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, భక్తులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కోరుట్లటౌన్: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికతో చదవాలని విశ్వశాంతి కరస్పాండెంట్ బ్రహ్మన్నగారి శంకర్ సూచించారు. ఈ మేరకు శనివారం రాత్రి విశ్వశాంతి విద్యాలయంలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చీటి సత్యంరావు, డైరెక్టర్లు గంగిశెట్టి కృష్ణ, కటుకం రాజేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత లక్ష్మీపూర్



విజేత జట్టుతో రవీందర్‌రెడ్డి

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు, అయోధ్య, స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్‌టోర్నీ పోటీలు ఆదివారం ముగిశాయి. విన్నర్‌గా లక్ష్మీపూర్, రన్నర్‌గా ఉప్పుమడుగు టీమ్‌లు నిలిచాయి. బీజేపీ నియోజకవర్గ నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జీవన్‌రెడ్డి, ముత్తయ్యగౌడ్, నాయకులు శేఖర్, శ్రీనివాస్, రాజు, దశరథ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

పెగడపల్లి: మండల కేంద్రంలోని పెగడపల్లి రామకృష్ణ విద్యా నిలయంలో 2002–03 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పెగడపల్లి పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు, ఉపాధ్యాయులు ప్రశాంత్‌రావు, వేణుగోపాల్‌రావు, సాగర్‌రావు, శ్రీనివాస్, సుదర్శన్, వెంకటేశ్వర్‌రావును సన్మానించారు.

చేతన హైస్కూల్‌లో..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో మిషన్ కాంపౌండ్ ప్రాంతంలో గల చేతన హైస్కూల్ 2011–12 పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

పెగడపల్లి: మండలంలోని అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి కార్యకర్తలకు సూచించారు. అయితిపల్లిలో బీఆర్ఎస్ సమావేశం ఆదివారం జరిగింది. పార్టీ పటిష్టత, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని, ఇంటింటికీ బీఆర్ఎస్ ఎజెండాలోని అంశాలను వివరించాలన్నారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కరుణాకర్‌రావు, గంగాధర్, సాగర్, శ్రీని వాస్, కొండయ్య, రహీం, జానీపాషా, విజయ్ యాదవ్, మల్లేశం, గోపాల్‌రెడ్డి, సంతోష్, షకీల్ పాల్గొన్నారు.

అద్దె ఇళ్లు.. అరకొర వసతులు

- అసౌకర్యాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- నిధుల లేమితో నిలిచిన భవనాల నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు, సిబ్బంది
- సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి



పెగడపల్లి: బతికపల్లిలో అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ

పెగడపల్లి: మండలంలో అరకొర వసతులు ఉన్న అద్దె ఇళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యకర్తలు, చిన్నారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఆ కేంద్రాలకు చిన్నారులను ఎలా పంపాలని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పెగడపల్లి మండలంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఏళ్ల నుంచి అనేక కేంద్రాలు అరకొర వసతులతో కూడిన అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. దీంతో కనీస వసతులు కరువై చిన్నారులు, కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు.

అద్దె భవనాల్లో 20 కేంద్రాలు..

చిన్నారులకు ఆటపాటల ద్వారా చదువు చెప్పాలనే సదుద్దేశం కార్యకర్తలకు ఉన్నా వసతుల లేమి కారణంగా పూర్తి స్థాయిలో నెరవేర్చలేకపోతున్నామని పేర్కొంటున్నారు. చిన్నారుల విద్యాబోధన కోసం పంపించిన చార్టులు కూడా గోడలు నునువుగా లేని కారణంగా వాటిని అంటించలేని దుస్థితి. మండలంలోని 23 గ్రామాల్లో 52 అంగన్‌వాడీ కేంద్రాలుండగా కమ్యూనిటీ భవనాల్లో 15 కొనసాగుతుండగా 17 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. 20 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

నిధుల లేమితో నిలిచిన నిర్మాణం

దోమలకుంట, ఏడుమోటలపల్లి తాండా, నామాపూర్ శివారు గ్రామమైన గొల్లపల్లె గ్రామాల్లో నిర్మించతలపెట్టిన అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలు నిధుల లేమితో నిలిచిపోయాయి. బతికపల్లిలో ఏడేళ్ల క్రితం పూర్తి చేసుకున్న భవనంలో కొన్ని రోజులు నిర్వహణ కొనసాగించారు. కానీ రహదారి సక్రమంగా లేకపోగా, చుట్టుపక్కల ప్రజలు భవనం ఆనుకొని మలవిసర్జన చేస్తుండడం, దీంతో వెదజల్లడంతో సొంత భవనం వదిలిపెట్టి అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. కనీసం రూ.2000 కిరాయి చెల్లిస్తేనే ఓ మోస్తరు వసతులున్న ఇళ్లు కిరాయికి లభించలేని పరిస్థితి ఉన్న నేపథ్యంలో వీరికి చెల్లిస్తున్న కిరాయి రూ.వెయ్యి మాత్రమే. ఇవి కూడా ప్రతి నెలకు సక్రమంగా ఇవ్వకపోవడంతో తామే వేతనాల నుంచి చెల్లించాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. సొంత భవనాలు లేక అరకొర వసతుల మధ్య నడుస్తున్న కేంద్రాలకు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు వెనుకాడుతున్నారు.

పక్కా భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి..

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ప్రభుత్వం ఇటీవల పటిష్టమైన చర్యలు చేపట్టి ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ సమయ పాలన పాటిస్తున్నారు. కేంద్రాల్లో ఆంగ్ల మీడియం విద్యాబోధన అమలు చేయడంతో పాటు మంచి పోషకాహారం అందించడానికి చర్యలు చేపట్టింది. కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన జరుగుతున్నప్పటికీ వసతులు సక్రమంగా లేక చిన్నారులను కేంద్రాలకు పంపించేందుకు వారి తల్లిదండ్రులు మొగ్గు చూపడం లేదు. వసతులు లేవన్న కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాల్సిన చిన్నారులను వారి తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవచూపి అన్నింటికీ పక్కా భవనాలు నిర్మించాలని అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదించాం. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు అందుబాటులో స్థలం ఉన్నచోట శాశ్వత భవనాలు నిర్మించేందుకు నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.
– నర్సింగారాణి, సీడీపీవో, మల్యాల ప్రాజెక్టు

జగిత్యాలలో కాంగ్రెస్, బీజేపీ దోస్తులు



కంటి వెలుగుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్: జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బీజేపీలు రాజకీయపరంగా కొట్లాడుకుంటే జగిత్యాలలో మాత్రం ఈ రెండు జాతీయ పార్టీలు దోస్తులేనని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆదివారం రాయికల్ మండలం కట్కాపూర్, దావన్‌పెల్లి, వస్తాపూర్ గ్రామాల్లో 'మీరునేను' కార్యక్రమంలో భాగంగా కట్కాపూర్‌లో రూ.32లక్షలతో వంతెన నిర్మాణం, రూ.10లక్షలతో సీసీరోడ్డు, దావన్‌పెల్లిలో రూ.10లక్షలతో పాఠశాల భవనం, రూ.10లక్షలతో సీసీరోడ్డు, వస్తాపూర్‌లో రామాలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం ఆసరా పింఛన్లు, రైతులకు రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయ సాగు కోసం ప్రాజెక్టులు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. అనంతరం కట్కాపూర్‌లో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్‌లు రాజమౌళి, యమున, రవి, సుమలత, పార్టీ మండలాధ్యక్షుడు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తలారి రాజేశ్, రామాలయ కమిటీ చైర్మన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చెరువు బాగుంటేనే రైతన్న బాగుంటాడు

జగిత్యాలఅగ్రికల్చర్: చెరువులు బాగుంటేనే, రైతన్న బాగుంటాడని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు జగిత్యాలరూరల్ మండలంలోని కండ్లపల్లి గ్రామ చెరువు మరమ్మతుకు రూ.43లక్షలు కేటాయించగా ఆదివారం ఆ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం చెరువులకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సర్పంచ్‌లు రజిత, తిరుపతి, ఎంపీటీసీ సౌజన్య, కౌన్సిలర్లు ఆసియా సుల్తానా, మల్లికార్జున్, రామ్‌కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



ఎజెండా అంశాలు చదువుతున్న వైద్యాధికారి

ధర్మపురి: గ్రామాల అభివృద్ధిలో అధికారులు భాగస్వాములవ్వాలని ఎంపీపీ చిట్టిబాబు సూచించారు. ఈ మేరకు ధర్మపురిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. గ్రామాల్లో చేపట్టే వివిధ ఎజెండా అంశాలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని, అధికారులు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఆయా పంచాయతీలకు సంబంధించిన అధికారులతో కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆందోళనలు సిగ్గుచేటు

గొల్లపల్లి: గ్యాస్ ధరలు పెరిగాయని బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేయడం సిగ్గు చేటని బీజేపీ మండల అధ్యక్షుడు కట్ల మహేశ్ అన్నారు. ఈ మేరకు గొల్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మంత్రులు అవినీతి అక్రమాలు చేయడంలో దేశంలోనే అగ్రగామిగా ఉన్నారని ఆరోపించారు. గ్యాస్, ఇంధన ధరలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కాదని సంబంధిత ఆయిల్ కంపెనీలు నెలకు ఒకసారి గ్యాస్ ధరలు నిర్దేశిస్తాయన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చాడ నాగరాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, బీమ మహేశ్, రమేశ్, స్వామి, వెంకటేశ్, శ్రీను, రాజేందర్ పాల్గొన్నారు.

క్రికెట్ టీమ్ సభ్యులకు టీషర్టులు అందజేత

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలోని శ్రీరామ క్రికెట్ టీమ్ సభ్యులకు ఆదివారం గ్రామ సర్పంచ్ మేసు ఏసుదాసు టీషర్టులు అందజేశారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత



పుస్తెమెట్టెలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మెట్‌పల్లి: మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన శిరీష అనే యువతి వివాహానికి పట్టణానికి చెందిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు చేయూతనందించారు. శిరీష వివాహానికి ఆమె తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు ఆదివారం వారికి పుస్తె,మెట్టెలతో పాటు పట్టు చీర అందజేశారు. ట్రస్ట్ తరఫున ఇప్పటి వరకు 34మంది యువతుల వివాహానికి ఆర్థికసాయం అందజేశామని ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్ వెల్లడించారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం



బట్టు పవన్ కుమార్

మల్యాల: మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బట్టు పవన్‌కుమార్, కార్యదర్శి సూర మహేశ్, కోశాధికారి కొంజర్ల శంకర్, ఉపాధ్యక్షులు విశ్వనాథం, రాంకిషన్, రమేశ్, జగన్, సహాయ కార్యదర్శి కట్కం రవి, నర్సింహులు, కోటేశ్, లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా బట్టు నాగరాజు, గంప అశోక్, బట్టు రాజేందర్, కేశెట్టి సంతోష్, సిరిపురపు సతీశ్, పుల్లూరి రాజేందర్, శ్రీను, ఎర్ర సాగర్, గాదె ప్రభాకర్, కట్కం శేఖర్, గుడిసె శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

వెల్గటూర్: వెల్గటూర్ మండల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం శనివారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని గంగాదేవి ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో సంఘ సభ్యులందరూ కలిసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడిగా ఎర్రొల్ల లచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా మెంట మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా గుమ్ముల వెంకటేశ్, కోశాధికారిగా బండమీది గోపి, డైరెక్టర్లుగా గుమ్ముల లచ్చయ్య, ఎర్రొల్ల మహేశ్, గుమ్ముల అంజయ్య, పందిరి రాజేశం, కల్లెడ వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ ఎన్నికకు సహకరించిన సంఘం సభ్యులందరికీ నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

యాదవ సంఘం మండలాధ్యక్షుడిగా ఆశన్న

కథలాపూర్: అఖిల భారత యాదవ మహాసభ మండలశాఖ అధ్యక్షుడిగా సిరికొండ గ్రామానికి చెందిన మ్యాదరవేని ఆశన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా దేశవేని మహేందర్, బైరి రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా పాలకాని సత్తయ్య, కోశాధికారిగా గంట చిన్నభూమయ్య, సహాయ కార్యదర్శులుగా రెబ్బాస్ శంకర్, బర్రె రమేశ్ ఎన్నికయ్యారు.

ఉపాధి రంగాలపై దృష్టిసారించాలి



పూజల్లో ప్రతినిధులు, సంఘం ప్రతినిధులు

కథలాపూర్: యువత ఉన్నత చదువులతోపాటు ఉపాధి రంగాలపై దృష్టిసారించాలని ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ సూచించారు. ఈ మేరకు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలో బంజారా ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మోహన్ పాల్గొని మాట్లాడారు. గిరిజన తండాల్లో ఉంటున్న యువకులకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన సంఘం మండల యూత్ అధ్యక్షుడు విఠల్ నాయక్, నాయకులు రాజన్న, ప్రభాకర్, స్వామి, నాయకులు మదన్ నాయక్, సంతోషన్‌నాయక్, తిరుపతినాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రయాణికులకు తప్పని తిప్పలు

కోరుట్లరూరల్: కోరుట్ల బస్టాండ్‌లో టాయిలెట్ గదులకు తాళం వేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు లేక మహిళలు అవస్థలు పడాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని టాయిలెట్ గదులు తెరిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : ప్రసూన లక్ష్మి, ఆర్టీసీ డిపో మేనేజర్
ఫోన్ నంబర్: 99592 25928

మండల పరిషత్‌లో వసతుల లేమి

- అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం
- రెండురోజుల కింద ఆన్‌లైన్ సేవల పునరుద్ధరణ
- శాశ్వత భవనం నిర్మించాలని వినతి



బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయం

సారంగాపూర్: బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయం ఓ ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. అసౌకర్యాలతో అటు కార్యాలయ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బీర్‌పూర్ 2016 అక్టోబర్ 11న మండలంగా ఏర్పాటైంది. మండలంలో 15 గ్రామాలు ఉండగా, మండల పరిషత్ కార్యాలయాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయ నిర్వహణకు మొదటి నుంచి నిధుల కొరత వేధిస్తోంది. మొన్నటి వర్షాకాలంలో ఒక దశలో భవనం పూర్తిగా ఉరవడంతో భవనంపై పెచ్చులు ఊడిపోయి కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. కార్యాలయంలో అధికారులు ఆయా శాఖల సిబ్బందితో కలిసి ఏదైనా సమావేశం నిర్వహించాలన్నా, మూడునెలలకు ఒకసారి నిర్వహించే మండలపరిషత్ సర్వసభ్య సమావేశం బీర్‌పూర్ రైతువేదికలో నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

వసతుల నిర్వహణ కష్టమే..

మండలపరిషత్ కార్యాలయంలో కనీస మౌలిక వసతుల నిర్వహణ కష్టంగా మారింది. మండల పరిషత్‌లోని ఎంపీపీ గదిలో విద్యుత్ సౌకర్యం లేని పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో ఏడాదిగా నెట్ బిల్లు చెల్లించకపోవడంతో, నెట్ బిల్లుల కింద రూ.14,300 చెల్లించాల్సి ఉండగా వారంరోజుల పాటు పూర్తిగా కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఎంపీపీ మసర్తి రమేశ్, ఎంపీడీవో మల్లారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని బిల్లులు చెల్లించి కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలను రెండు రోజుల కింద పునరుద్ధరించారు. దీంతో పాటు ఏడాదిగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో రూ.80వేల విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉంది. ఎంపీపీ చాంబర్‌లో ఫ్యాన్ కాలిపోగా కనీసం బల్బు వెలగడం లేదు. కార్యాలయంలోని నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన మోటారు కాలిపోయి నీటి సరఫరా నిలిచిపోయింది. కార్యాలయ సిబ్బంది వాష్‌రూం, బాత్‌రూమ్‌లకు నీటి సరఫరా నిలిచిపోవడంతో కార్యాలయ సిబ్బంది, అధికారులు, కార్యాలయానికి వచ్చే ప్రజాప్రతినిధులు ఇబ్బంది పడుతుండడంతో ఎంపీపీ సూచనతో ఎంపీడీవో విద్యుత్ పునరుద్ధరణ చర్యలు తీసుకోవడంతో సమస్య తాత్కాలికంగా సమసిపోయింది. మండలపరిషత్ కార్యాలయానికి శాశ్వత భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు కాకపోవడంతో ఇరుకు గదుల్లో పాలనాపరంగా కార్యాలయ సిబ్బంది అవస్థలు పడుతున్నారని ఎంపీపీ రమేశ్ పేర్కొన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంపై దృష్టిసారించి శాశ్వత భవన నిర్మాణంపై ప్రభుత్వానికి నివేదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పైడిపెల్లి విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన పైడిపెల్లి విద్యార్థులు

వెల్గటూర్: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో జిల్లాలోని పైడిపెల్లి, గొడిషెలపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గోజురాయి కరాటే జోడో అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఏడో రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో పైడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు కోచ్ కొండపల్లి అఖిల ఆధ్వర్యంలో పాల్గొన్నారు. ఎండీ దౌలత్‌ఖాన్ స్వర్ణం, జి.అఖిల్ రజతం, రక్షిత్, సాయికిరణ్, సుశాంత్, వెంకటస్వామి, నిఖిల్, ధనోజ్, కుమార స్వామి కాంస్య పథకాలు సాధించారు. అలాగే గొడిషెలపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు అరుణ్, కిశోర్ స్వర్ణం, అజీరియా, అరవింద్, సంజనలు రజత పథకాలు, ఐశ్వర్య, వైష్ణవి కాంస్య పథకాలు సాధించారు. పైడిపల్లి, గొడిషెలపేట సర్పంచులు గంగుల నగేష్, మెతుకు స్వరూప, వైస్ ఎంపీపీ కవిత, ఎంపీటీసీ రాయమల్లు విద్యార్థులను అభినందించారు.

జోగిన్‌పెల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజనర్సయ్య

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులను సర్పంచ్ దుంపాల నర్సు రాజనర్సయ్య ఆదివారం ప్రారంభించారు. ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. కర్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి రెడ్డి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో ప్రజాప్రతినిధులు, నాయకులు

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామంలో పోచమ్మ ఆలయం నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి అయ్యే ఖర్చు బొప్పరాతి లక్ష్మీనారాయణ వెచ్చిస్తారని గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పాల్తెపు గంగారాం, వైస్ చైర్మన్ ఎల్లాల గంగారెడ్డి, జలపతిరెడ్డి, చెల్లపెల్లి అంజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.